టమాట పైరుకు భారీ డిమాండ్

- మార్కెట్లో పెరిగిన టమాట ధర
- పంట సాగుపై రైతుల ఆసక్తి
- వెయ్యి మొక్కలకు రూ.900 పలుకుతున్న ధర


గందోడివారిపల్లి క్రాస్‌లోని ఓ నర్సరీలో ఉన్న టమాట పైరు

తనకల్లు: టమాట పైరుకు ప్రస్తుతం భారీ డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లో టమాట ధరలు పెరగడంతో రైతులు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒక్కసారిగా టమాట పైరుకు గిరాకీ పెరిగింది. వివరాల్లోకెళితే.. మండలంలో వేరుశనగ తరువాత టమాట పంటను రైతులు అత్యధికంగా సాగు చేస్తారు. దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట సాగవుతుంది. కొక్కంటిక్రాస్, నల్లగుట్లపల్లి, గందోడివారిపల్లి క్రాస్ సమీపంలో ఎక్కువగా కూరగాయల మొక్కల నర్సరీలున్నాయి. నర్సరీల్లో టమాటా, మిరప, వంక తదితర పైర్లను విక్రయిస్తారు. అయిగే మార్కెట్ సౌకర్యం బాగా ఉండడంతో టమాట సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

బాక్సు ధర రూ.వెయ్యి

సాధారణంగా ఇక్కడ పండిన టమాటను అన్నమయ్య జిల్లా మదనపల్లి, మొలకలచెరువు, కర్ణాటకలోని కోలారు, చింతామణి తదితర మార్కెట్లకు తరలిస్తారు. అయితే వర్షాలు బాగా కురవడం, మార్కెట్లో 33 కిలోల బాక్సు రూ.1000కిపైగా పలుకుతుండడంతో రైతులు టమాట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈనేపథ్యంలో టమాట పైరుకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగినట్లు నర్సరీల యజమానులు చెబుతున్నారు. రెండు నెలల క్రితం 1000 టమాట మొక్కలు (పైరు) రూ.500 నుంచి రూ. 600 పలికేవి. అయితే ప్రస్తుతం రూ. 800 నుంచి రూ. 900లకు పైగా పెరిగిందని రైతులంటున్నారు. పైరు కావాలని నర్సరీలకు వెళ్తే అక్కడ వారం రోజులు పాటు వేచి ఉంటే కాని మొక్కలు దొరకని పరిస్థితి ఉందంటున్నారు.

టమాట పైరుకు గిరాకీ



రైతులు టమాట సాగుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండలంలో టమాట సాగు పెరగనుంది. మా నర్సరీలో సాహో, 448, 440, సాహిత్య తదితర రకాల టమాట పైరుకు డిమాండ్ ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు నాణ్యమైన పైరును అందిస్తున్నాం.

– నాగరాజు, నర్సరీ నిర్వాహకుడు, గందోడివారిపల్లి క్రాస్

పైరు కోసం వేచి ఉన్నా



టమాటను సాగు చేయడానికి పొలాన్ని సిద్ధం చేశారు. రైతులందరూ టమాట సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. డిమాండ్ అధికంగా ఉండడంతో పైరు ధరలు గతంలో కంటే పెరిగాయి. అయితే పైరు దొరకడం కష్టంగా ఉంది. నాణ్యమైన పైరు కోసం వేచి ఉన్నా.

– నాగభూషణరెడ్డి, రైతు, చీకటిమానిపల్లి

క్లుప్తంగా

చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న చౌడేశ్వరీదేవి

తాడిమర్రి: పెద్దకోట్లలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు


ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేద ప్రజలకు కంటిచూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్త, క్యాంపు చైర్మన్ కృష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాతలుగా మామిళ్ల వెంకట రమణమ్మ జ్ఞాపకార్థం మామిళ్ల రంగనాయకులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శిబిరంలో 170 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 117 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాతలతోపాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. రోటరీక్లబ్ సభ్యులు సోలిగాళ్ల వెంకటేషులు, సత్రసాల ప్రసన్నకుమార్, బీవీ చలం, శివయ్య, కొండయ్య, శంకర్ కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ శివప్రకాష్, రామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించాలి


చెరువుకట్ట కింద మలుపుల్లో పెరిగిన ముళ్ల చెట్లు

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి నుంచి న్యామద్దెల, ముష్టికోవెల గ్రామాలకు వెళ్లే రహదారిలో న్యామద్దెల చెరువు కట్ట కింద ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్లచెట్లను ఇలానే వదిలేస్తే మరింతగా పెరగడంతో వాటి వేర్లు చెరువు కట్ట లోపలికి చొచ్చుకు పోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వీటిని తొలగించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా కైవారం తాతయ్య ఉత్సవం


పూజలు అందుకున్న తాతయ్య మూలవిరాట్

హిందూపురం: కైవారం క్షేత్రంలో ఆదివారం తాతయ్య జీవ సమాధి ఉత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవానికి హిందూపురం నుంచి వందలాదిమంది తరలివచ్చారు. ఈసందర్భంగా తాతయ్య మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం ఆవరణలో భజనలు చేశారు. కార్యక్రమానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చినట్లు హిందూపురం సద్గురు యోగినారాయణ సేవాసమితి సభ్యులు తెలియజేశారు.

పోతలయ్య స్వామికి పూజలు


అలంకరణలో పోతలయ్య స్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్య స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవస్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: చౌళూరు పంచాయతీలోని రామచంద్రపురంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన బాధితులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత చౌళూరు మధుమతిరెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి దాడుల సంస్కృతి హిందూపురం ప్రాంతంలో ఎన్నాడూ లేదన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలని కోరారు. ఘర్షణలు, దాడులు అభివృద్ధికి ఆటంకాలన్నారు. దాడి చేసిన వారిలో చౌళూరు రామక్రిష్ణరెడ్డి హత్య కేసు ముద్దాయి కూడా ఉండటంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు.

ప్రధాని మోదీ ప్రమాణంపై సంబరాలు


పుట్టపర్తిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

పుట్టపర్తి రూరల్: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడంతో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక హనుమాన్ సర్కిల్ వద్ద ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన కేక్ కత్తిరించి అన్నదానం చేశారు. లాయర్ హరికృష్ణ గౌడ్, కొండమ రాజు సుదర్శన్ కత్తి రాజారెడ్డి మేకల శీన జ్యోతి ప్రసాద్ సురేంద్ర బాబు బాలగంగాధర్ రామాంజనేయులు, నారాయణ కళ్యాణ్, బీసీ గంగన్న సామకోటి ఆదినారాయణ, రామారావు, శ్రీరామ్ రెడ్డి,రఫీ బొగ్గరం శీన అబ్దుల్ శివప్రసాద్ మారుతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సంబరాల్లో ఆ పార్టీ కదిరి, పుట్టపర్తి నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఒక వర్గం, ఇది సమష్టి బాధ్యతని మరో వర్గం మధ్య వాదోపవాదనలకు దిగారు.

ఎన్పీకుంట: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల కేంద్రంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యవర్గ సభ్యుడు షేక్ బాబ్జాన్, మండలాధ్యక్షుడు కొసెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు.

తనకల్లు: దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడవసారి బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా స్థానిక డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం బీజేపీ నాయకులు కేక్ కట్ చేశారు. నాయకులు హసనాపురం చంటి , నేసే జానకీరాం, బాబాఫకృద్దీన్, లక్ష్మీనారాయణ, వేమనారాయణ, నరేష్, సురేంద్ర, బాలాజీ, భార్గ, సేవా సమితి ఆంజినేయులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ పరీక్షలు


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

హిందూపురం: పట్టణంలోని దీప్తి స్కూల్‌లో ఆదివారం ఎస్.ఫైరోజ్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన 56 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఏఎస్‌గోజు ర్యూ కరాటే ఆల్ ఇండియా చీఫ్ క్యోషి అల్తాఫ్ పాషా నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. బెల్ట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, బెల్ట్‌లను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కరాటే సీనియర్లు హేమంత్, ఉషా, చరణ్, నరేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో ఆదివారం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్ష నిర్వహించారు. కరాటేలో శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు మహేంద్ర, దర్శన్, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..


చెన్నేకొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి


గొయ్యి లోపల ఖాళీగా ఉన్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి వద్ద ఉన్న వంకపై నిర్మించిన 44 నంబర్ జాతీయ రహదారి వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. కొన్ని నెలల క్రితం వంతెన సేఫ్టీవాల్‌కు పక్కన చిన్న గొయ్యి ఏర్పడింది. పైకి చిన్న గొయ్యిగా కనిపించినా లోపల రెండు నుంచి మూడు అడుగుల వెడల్పు గోతి ఏర్పడింది. దీనిని గమనించని పెద్ద వాహనాలు అటుగా వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రహదారిపై మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– చెన్నేకొత్తపల్లి:


పట్నంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

కదిరి అర్బన్: పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తమకు పాఠాలు నేర్పిన ఆనాటి గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేష్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు చంద్రశేఖర్, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : మండలంలోని తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. స్థానిక పాఠశాలలో 1991–95 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరికి విద్యాభ్యాసం చేసిన పలువురు ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులంతా ఒకచోట చేరి గత జ్ఞాపకాలను నెమరివేసుకున్నారు. ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

బాధితురాలికి ఆపన్నహస్తం


బాధితురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళ వైద్యం కోసం వాలీబాల్ క్రీడాకారులు ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన అంజప్ప, తిప్పమ్మల కుమార్తె గౌరీ అనారోగ్యంతో బెంగళూరులో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న అదేనగర్‌కు చెందిన వాలీబాల్ క్రీడాకారులు ఆదివారం రూ.15వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్సిపల్ మేనేజర్ నరసింహులు, సీఐ శ్రీనివాసులు, చలంబాబు, శంకర్, రమణ, కొండప్ప, వెంకటేషులు, రామచంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుడికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి త్రికాల పూజలైన సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. ఆదివారం సెలవు కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన పావగడ, శిర, హిరియూర్, మధుగిరి, తుమకూరు, బెంగళూరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు


రోగికి అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్న వైద్యురాలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో రోగులకు మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ సెంటర్‌లో రోజూ 80 మందికి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 20 మందికి పైగా రోగులకు అల్ట్రాసౌండ్ సేవలు అందిస్తున్నారు. జీజీహెచ్‌లోని సెంటర్‌లో మూడు స్కానింగ్ మిషన్లు ఉన్నాయి. అందులో అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు, పీజీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కాన్‌లు చేస్తున్నారు. ఆస్పత్రిలోని గైనిక్, చిన్నపిల్లల, ఐసీసీయూ, ఆర్థో, చెస్ట్, సర్జరీ, ఏఎంసీ, ఎంఎం, ఎఫ్ఎం తదితర వార్డుల నుంచి రోగులకు అబ్‌డామిన్, పెల్వీస్, ఛాతి, పసికందులకు బ్రెయిన్, మోకాళ్లు, కంటికి స్కాన్ చేసి రిపోర్టులు అందజేస్తున్నారు. ఇటువంటి స్కాన్ చేయాలంటే ఒక్కోరికి రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు అవుతుంది. అటువంటిది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా చేస్తుండటంపై రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సుందరరాజు

లేపాక్షి: లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా సుందరరాజు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్ కడప జిల్లా తొండూరు గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫాతో పాటు అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతు అధ్యాపకులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పాఠశాల అభివృద్ధితో పాటు మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పావగడ: గ్రామంలోని హరిజన వాడలో నెలకొన్న విద్యుత్, మురుగు సమస్యలను పరిష్కరించాలని ఎస్ఐ జయరాంకు కాలనీ ప్రముఖులు విన్నవించారు. ఆదివారం గ్రామంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ వర్గాల సభలో కాలనీ ప్రముఖులు ఆంజనేయ, రామకృష్ణ మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో చాలా రోజుల నుంచి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. అదే విధంగా అక్రమ మద్యం అమ్మకాలతో ఘర్షణలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. వెంటనే అక్రమ మద్యం అమ్మకాలను నివారించి కాలనీలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ సభలో సమస్యలు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని వాపోయారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన


విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించిన ముఖ్య అతిథులు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ లలిత నాట్య కళానికేతన్ డ్యాన్స్ మాస్టర్ బాబు బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య నీరాజనం ఆకట్టుకుంది. వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద తదితర నృత్య రూపకాలు ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలన్న సదుద్దేశంతో చిన్నారులకు శిక్షణ ఇచ్చామని మాస్టర్ బాబుబాలాజీ తెలిపారు. ఈ నృత్య ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఈఓ మీనాక్షి, అనంతపురం లలిత కళాపరిషత్ అధ్యక్షురాలు పద్మజ, సకలవృత్తి సంక్షేమ అధ్యక్షులు ఆనంద్ విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందించారు. అనంతరం డ్యాన్స్ మాస్టర్ బాబుబాలాజీ, కమలా బాలాజీ, రామలాలిత్యలను సత్కరించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం గాయత్రి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్ కార్యక్రమంలో చిన్నారులు డాన్స్‌లతో అదరగొట్టారు. డ్యాన్స్ మాస్టర్ కిషోర్‌కుమార్ డ్యాన్స్ చేసిన ప్రతి చిన్నారులు, విద్యార్థులకు మెమొంటోలు అందించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.